# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో పీ4 కార్యక్రమం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **రాజధాని అమరావతికి నీటి సదుపాయం కోసం మూడు జలాశయాలను నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
3. **రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.**
4. **పేదవారికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.**
5. **రహదారి ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వెల్లడించారు.**

==========================

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యం పీ4 కార్యక్రమం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, కలెక్టర్లతో దృశ్యమాధ్యమ విధానంలో ముఖ్యమంత్రి సమావేశాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం చేనేత రంగంపై కూడా ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

రాజధాని అమరావతికి నీటి సదుపాయం కోసం మూడు జలాశయాలను నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న భవనాలను మంత్రి ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రాజధానితో పాటుగా కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలో ఎరువుల నిల్వలు, వినియోగంపై దృశ్య మాధ్యమ విధానం ద్వారా జిల్లాల కలెక్టర్లతో మంత్రి ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ పంట కాలానికి సరిపడే ఎరువుల నిల్వలు ఉండేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, మార్క్ ఫెడ్ గోదాముల ద్వారా ఎరువులు అందచేస్తున్నామని చెప్పారు.

---------------------------

పేదవారికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 43 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 30 లక్షల 31 వేల 151 రూపాయల చెక్కులను క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈరోజు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో 235 మంది లబ్ధిదారులకు 2 కోట్ల 14 లక్షల రూపాయాల లబ్ధి చేకూర్చామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో సహాయపడుతుందని మంత్రి వివరించారు.

---------------------------

రహదారుల నిర్మాణం ఆయా ప్రాంతాల సమగ్రాభివృద్ధికి తోడ్పడతాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. 'సారథ్యం' కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లాలో పర్యటిసున్న ఆయన గుంటూరు నగరంలోని పుండరీకాక్షయ్య పార్కు వద్ద స్థానికులతో నిర్వహించిన 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో ఈ రోజు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ,

వాయిస్ 23 సెకన్లు

---------------------------

తిరుమలలో ఈరోజు నుంచి ఆగస్టు 7 వరకు శ్రీ వెంకటేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. సంవత్సరం పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాలకు నివారణగా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

రహదారి ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీ వరకూ డ్రంకెన్ డ్రైవ్, ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకూ అధిక వేగం, 18 నుంచి 24 వరకూ హెల్మెట్ లేని ప్రయాణానికి సంబంధించిన ఉల్లంఘనలపై డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25 నుంచి

31 వరకూ.. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ గుర్తింపు చేపట్టనున్నామని తెలిపారు.

---------------------------

ఏలూరు జిల్లాలో ఈ రోజు జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. జిల్లాలోని ఉంగుటూరు మండలం కైకరం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని హైదరాబాద్ నుంచి తణుకు వెళు తున్న ప్రైవేటు అంబులెన్స్ వేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహణంలో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారని, మృతులు కైకరం గ్రామానికి చెందినవారిగా గుర్తించామని తెలిపారు.

---------------------------

చౌకధర దుకాణాల్లో ప్రజలకు అందించే బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు జి.దేవి హెచ్చరించారు. చిత్తూరు జిల్లాలోని అశోకపురంలో రేషన్ దుకాణాన్ని ఈరోజు ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ప్రజలకు అందిస్తున్న నిత్యవసర సరుకులను పరిశీలించి లబ్ధిదారులతో సరుకుల పంపిణీ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవి మాట్లాడుతూ, రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకతను పాటించేలా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 305 పాయింట్ల నష్టంతో 80 వేల 712 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 92 పాయింట్ల నష్టంతో 24 వేల 629 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్...33 సెకన్లు

---------------------------

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మనమిత్ర – వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెల 5వ తేదీన అన్ని సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్ పై ర్యాలీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. 9552300009 నంబర్ ద్వారా 200లకు పైగా ప్రభుత్వ సేవలు అందించడం జరుగుతుందన్నారు.

======================